దారులన్నీ గులాబీమయం



అభిమానులకు అభివాదం చేస్తూ..



ప్రచార వాహనంపై ర్యాలీగా వెళ్తూ..

హ్యాట్రిక్ విజయం అందిస్తాం



నామినేషన్ ర్యాలీలో కార్యకర్తలు

నామినేషన్ ఘట్టం



ఎమ్మెల్యేను వినూత్నంగా స్వాగతం పలుకుతున్న కార్యకర్త



- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో కలసి నామినేషన్ దాఖలు చేసిన కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్



కట్టమైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యేకు రక్షణ కంకణం కడుతున్న పంతులు



కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్ నామినేషన్ కార్యక్రమం కనివినీ ఎరుగని రీతిలో భారీ కార్యకర్తల ర్యాలీ మధ్య అట్టహాసంగా జరిగింది. గురువారం ఉదయం కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వివేకానంద్ తదనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో కలిసి ఓపెన్ టాప్ వాహనంపై ర్యాలీగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి నామినేషన్ దాఖలు చేసేందుకు తరలి వెళ్లారు. ఈ నేపథ్యంలో మహిళల బోనాలు, భారీ బైక్ ర్యాలీలు, అభిమానుల డ్యాన్స్‌లు, గజమాల అలంకరణలతో ఆద్యంతం పండుగ వాతావరణాన్ని తలపించింది.

- సూరారం నుంచి కుత్బుల్లాపూర్ వరకు ప్రధాన రహదారులు గులాబీమయంగా మారాయి. రోడ్లన్నీ బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయాయి. అంతకు ముందు ఎమ్మెల్యే నివాసంలో వేదపండితులు, ఇమామ్‌లు, పాస్టర్లు, జైన మత పెద్దలు ఎమ్మెల్యే అభ్యర్థి వివేకానంద ఆశీర్వచనాలు అందజేశారు. దారి పొడవుగా డీజే పాటలతో అభిమానులు నృత్యాలు చేశారు. వివేకానంద్‌కు హ్యాట్రిక్ విజయం అందిస్తామంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ప్రజాప్రతినిదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల నాయకులు తరలి వచ్చారు.



సూరారం కట్టమైసమ్మ ఆలయం నుంచి ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుల ర్యాలీలో పాల్గొన్న జనసందోహం



ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజులకు గజమాల వేసిన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు



ఎమ్మెల్యే వివేకానంద్ నామినేషన్ నేపథ్యంలో జనసంద్రంగా మారిన రాహదారులు

నామినేషన్ల కోలాహలం



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నామినేషన్ల కార్యక్రమం గురువారం రసవత్తరంగా మారింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల ఎమ్మెల్యే వివేకానంద్, కొలన్ హన్మంతరెడ్డిలతో పాటు మరో ఎనిమిది మంది నామినేషన్ల పత్రాలను అందజేశారు. బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ తరపున రెండు సెట్ల నామినేషన్లు సమర్పించగా భారత చైతన్య యువజన పార్టీ నుంచి కాంతారం మంజులత, బీజేపీ నుంచి కూన దినేష్‌కుమార్‌గౌడ్, ఇండిపెండెంట్‌గా సాయికుమార్ పంతుల, మహ్మద్ మహషిన్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కిరణ్‌కుమార్, నవరంగ్ కాంగ్రెస్ నుంచి మహ్మద్ వాజిద్, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ తరపున మహ్మద్ అజార్‌లు నామినేషన్‌లు వేసినట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు.

జంగ్ తెలంగాణ 2023

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: హెచ్ఎండీఏ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 33/11 భౌరంపేట్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శంభీపూర్, మహేశ్వరం, భౌరంపేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సాయిలతా స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

రంగారెడ్డినగర్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం షాపూర్‌నగర్‌లోని సాయిలతా మోడల్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సీనియర్ పారా లీగల్ వలంటీర్ మధుబాబు చికిలే విద్యార్థులకు న్యాయ సేవాదికార చట్టం-1987, పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, ఉచిత న్యాయ సహాయం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పేదలు, మహిళలు, బాలలు, అసంఘటిత కార్మికులు, మానవ అక్రమ రవాణా బాధితులు, విపత్తు బాధితులు, కార్మికులు, రాజ్యాంగ ప్రకరణ 39-ఏ ప్రకారం ఉచితంగా న్యాయ సహాయం పొందే హక్కు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దయాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద రెచ్చిపోతున్న దొంగలు



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద దొంగలు రెచ్చిపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు తమ వాహనాలను బయట పార్కింగ్ చేస్తుంటారు. కార్యాలయం గేటు వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు హెల్మెట్‌లు, ద్విచక్ర వాహనంలో ఉన్న వస్తువులను, బ్యాగులను అపహరిస్తున్నారు. ఇలా ఇప్పటికి పదుల సంఖ్యలలో దొంగతనాలు జరిగాయి. పార్కింగ్ చేసిన వాహనాల వద్ద బ్యాగుల్లో విలువైన పత్రాలు ఉంటే పరిస్థితి ఏమిటి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారులు దొంగలపై నిఘా వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నియామకం



సొంటిరెడ్డి చైతన్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న సునీతరావు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షురాలిగా సొంటిరెడ్డి చైతన్య నియమితులయ్యారు. గురువారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మిల చేతుల మీదుగా చైతన్య నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఇంటర్ స్కూల్స్ గేమ్స్ పోటీలు ప్రారంభం

జీడిమెట్ల: చదువుతో పాటు విద్యార్థులకు ఆటలను సైతం ఒక అంశంగా బోధించాలని తెలంగాణ స్పోర్ట్స్ కన్వీనర్, చైల్డ్ సైకాలజిస్ట్ డా.సత్యశ్రీ అన్నారు. గురువారం అపురూపాకాలనీలోని టీవీఆర్ పాఠశాలలో ప్రారంభించిన ఇంటర్ స్కూల్స్ గేమ్స్ కాంపిటేషన్స్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హజరై పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పోర్ట్స్ ఆడటం వలన పిల్లలు శారీరకంగా బలంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఈ క్రీడలను పినాకిల్ ఎడ్యుకేషన్, టీవీఆర్ విద్యా సంస్థల ఆద్వర్యంలో నిర్వహించారు.



ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదం దారుణం

- పోరాట కమిటీ నాయకులపై కేసులను ఎత్తివేయాలి
- తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదాన్ని మోపడం సరైంది కాదని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ గ్రామం దగ్గర జూరాల ఆర్గానిక్ ఫార్మ్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా ఈ కంపెనీ ఏర్పాటు చేయడం సరైంది కాదని ఈ కంపెనీ ఉత్పత్తి జరిగితే దాని ప్రభావం చుట్టు పక్కల ఉన్న 54 గ్రామాలపై పడుతుందన్నారు. గాలి, నీరు, భూగర్భ జల కాలుష్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానది కాలుష్యపు కోరల్లోకి వెళ్తుందని పర్యావరణ వేత్తలు కూడా చెబుతున్నారని అయినా ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తు ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిని చిత్రహింసలకు గురి చేసి జైలులో నిర్బందించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోరాట కమిటీ నాయకులు, రైతులపై పెట్టిన కేసులను బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... కంపెనీ పరిసర ప్రాంతాల్లోని పంట పోలాల్లో పని చేసే కూలీలు ఊపిరాడక స్పృహతప్పి పడిపోతున్నారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలపై పెట్టిన కేసులను బేషరుత్తుగా ఎత్తివేసి ఆ కంపెనీని మూసి వేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ పాలనలో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

లాలాపేట: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి పెద్ద పీట వేసిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో గిరిజన సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సమాచార శాఖ రాష్ట్ర మాజీ కమిషనర్ డా. గగులోతు శంకర్ నాయక్ తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జిఎస్ఎస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతు బీమా, 24 గంటల విద్యుత్, కల్యాణ లక్ష్మీ, తాగు నీరు, సాగు నీరు వంటి పథకాలతో రూపొందిన వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా తండాలో మా రాజ్యం పేరుతో 3146 గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంత్ సేవాలాల్, కొమురం భీమ్‌ల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు బంజారా భవన్ నిర్మాణం చేపట్టారని కొనియాడారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలనీ కోరారు. ముచ్చటగా మూడవ సారి కేసిఆర్ సీఎం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్ఈపీ దేశ అభివృద్ధిని నిర్ధారిస్తుంది

కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డా.సుభాష్ సర్కార్

రాయదుర్గం: జాతీయ విద్యావిధానం దేశ అభివృద్ధిని నిర్ధారిస్తుందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాష్‌సర్కార్ పేర్కొన్నారు. మనూలో టీచింగ్ స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో ఆయన గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయం నూతన విద్యావిధానం-2020 (ఎన్ఈపీ-2020)ని అమలు చేసిన తీరు అభినందనీయమన్నారు. నూతన జాతీయ విద్యావిధానం రాబోయే పదేళ్ళలో దేశ విద్యారంగాన్ని పూర్తిగా మార్చివేస్తుందన్నారు. విద్యార్థులు సులభంగా విద్యనభ్యసించడంతోపాటు నైపుణ్యం కలిగిన వారిని తీర్చిదిద్దడం ద్వారా ఉపాధి పొందడం సులువు అవుతుందన్నారు.

అవిశ్రాంత పోరాట యోధుడు చంద్ర పుల్లారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాణ యోధుడు చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ఆరుట్ల జానికిరెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చంద్రపుల్లారెడ్డి చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగించినప్పుడే చంద్ర పుల్లారెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.



గాజులరామారంలో వివిధ బస్తీల ప్రజలతో సమావేశమైన కూన శ్రీశైలంగౌడ్



శ్రీనివాస్‌నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

ఆశీర్వదించి గెలిపించాలి

- కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్
- ప్రచారంలో వివిధ కుల సంఘాలతో సమావేశం
- సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ
- బీజేపీలోకి చేరుతున్న వివిధ కాలనీల ప్రజలు

జోరుగా 'కూన' తనయుడి ప్రచారం



నెహ్రూ నగర్, సంజయ్ గాంధీనగర్‌లలో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా ఆయన తనయుడు కూన కృష్ణగౌడ్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కమలం గుర్తుపై ఓటేసి తన తండ్రిని గెలిపించాలని కోరారు.

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కారు టైర్లు పంక్చర్ అయ్యాయని... తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని మోసం చేస్తూ వస్తున్న బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కుత్బుల్లాపూర్ నియోజవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారాలతో పాటు వివిధ కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ప్రచారా ఆర్భాటాలే తప్ప తొమ్మిదేళ్లుగా కుత్బుల్లాపూర్‌లో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు.

పలు ప్రాంతాల్లో బీజేపీలోకి భారీగా చేరికలు..

- జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో ఆర్ఎంపీ మహిళ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీశైలం గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. యశోద, మీనా, ప్రభావతి, అనురాధ తదితరులు పార్టీలో చేరగా ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెకె శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి, డివిజన్ ఇంచార్జ్ మోతే శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, రామనరసయ్య, సిద్ధిరామిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అర్కల సుధా, నాయకులు మహేందర్, రాజిరెడ్డి, మధు, వసుందర, నాగరాజు, ముప్పిడి రవి తదితరులు ఉన్నారు.
- గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఒగ్గు శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు.
- గాజులరామారం డివిజన్, శ్రీరామ్‌నగర్ (ఏ)కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నర్సింగరావు తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరగా కూన శ్రీశైలంగౌడ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.
- కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మనగర్ ఫేజ్ -1 కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొట్టి రమణతో పాటు నాగిరెడ్డి, శివ ప్రవీణ్, బాలాజీ, వెంకటేష్, శ్రీనివాస్, రాంబాబు, అర్జున్ రావు, సంజీవ్ యాదవ్ బీజేపీలో చేరగా కూన శ్రీశైలంగౌడ్ వారికి కాషాయ కండువాలు కప్పారు. అదే విధంగా జనసేన పార్టీ నాయకులు అడప వీరేశ్వర్‌రావు, తాతాజీ, సాయి, శివకుమార్ మద్దతు తెలిపారు.
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుంకరి సాయి ప్రతాప్ ఆధ్వర్యంలో వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన నాయకులు, ముదిరాజ్ సంఘం పెద్దలు కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దమ్మెన కుమారస్వామి, తెల్ల బాలరాజు, ఉమేష్, బక్కని పాండు, దమ్మని యశ్వంత్, విష్ణు ముదిరాజ్, సాయిబాబా, రాజగోపాల్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత, బాలప్ప, గరిగే శేఖర్ ముదిరాజ్, మోతే శ్రీనివాస్ యాదవ్, కంది శ్రీరాములు, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

కాపు నాయకులతో ప్రత్యేక సమావేశం..



గాజులరామారంలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో కూన శ్రీశైలంగౌడ్ జనసేన పార్టీ నాయకులు, కాపు సంఘం నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతున్న నేపథ్యంలో తన విజయానికి కృషి చేయాలని కోరారు.



పద్మానగర్ ఫేజ్-1కు చెందిన కొట్టి రమణకు బీజేపీ కండువా కప్పుతున్న కూన శ్రీశైలంగౌడ్



బీజేపీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సుంకరి సాయిప్రతాప్

సంఘాల వైపు.. పార్టీల చూపు

- యువజన, మహిళా, కుల సంఘాలపై పార్టీల దృష్టి
- అంతర్గత సమావేశాలు.. రహస్య మంతనాలు
- సామాజిక వర్గాల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రాజకీయ సందడి మొదలైంది. శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఓట్ల వేట కోసం తమదైన శైలిలో ముందుకు కదులుతున్నాయి. యువజన, మహిళ, కుల సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. వారందర్నీ ఒకచోట సమీకరించి ప్రచారం నిర్వహిస్తున్నాయి. హామీలిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేపడుతున్నాయి. ఈ సంఘాలను మచ్చిక చేసుకుంటే లాభిస్తుందన్న ముందస్తు ఆలోచనతో నేతలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో పార్టీలన్నీ గెలుపు కోసం నువ్వా నేనా..? అన్నట్లు పోటాపోటీగా ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. జిల్లాలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించటంతో.. ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. బీజేపీ మాత్రం జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు అచితూచి అడుగులు వేస్తోంది. మొదటి విడతలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను, రెండో విడతలో ఉప్పల్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్ఎస్ఎస్ ప్రభాకర్‌ను ఖరారు చేయగా, ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. సీట్ల పొత్తులో భాగంగా కూకట్‌పల్లి స్థానాన్ని జనసేనకు కేటాయించిన బీజేపీ మల్కాజిగిరి, మేడ్చల్ స్థానంలో అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. అయితే.. టికెట్ ఖచ్చితంగా వస్తుందని భావిస్తున్న నేతలు మాత్రం ఇంటింటి ప్రచారంతో ప్రజల మద్దతు కూడగట్టుకుంటున్నారు. రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా.. జిల్లాలోని ప్రధాన పార్టీలన్నీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ విభిన్న ప్రచార వ్యూహాలకు తెరలేపుతున్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో మహిళా, యువజన సంఘాలతోపాటు కుల సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి మద్దతు కూడగటేట్ ప్రయత్నంపై పార్టీలు ముమ్మర ప్రయత్నం చేస్తున్నాయి. కుత్బుల్లాపూర్‌లో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద, మేడ్చల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తోటకూరి వజ్రేష్‌యాదవ్ మాత్రం యువజన, మహిళా, కుల సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వారందరినీ సమీకరించి మద్దుతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లోనూ పార్టీల అభ్యర్థులు అన్ని సంఘాలతో సమావేశాలు జరుపుతూ మద్దతు కూడగట్టుకుంటున్నారు.

అంతర్గత సమావేశాలు.. మంతనాలు

ఎన్నికల్లో భాగంగా రోజంతా ప్రచారం కొనసాగిస్తున్న పార్టీల అభ్యర్థులు.. రాత్రి సమయాల్లో ముఖ్య నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ.. మంతనాలు జరుపుతున్నారు. ముఖ్యంగా బస్తీలు, పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, అపార్టుమెంట్లు, కాలనీలు, గ్రేటర్ కమ్యూనిటీ సొసైటీల్లో.. ఆరోజు జరిగిన రాజకీయ పరిణామాలు తెలుసుకుంటున్నారు. ఎదుటి పార్టీల ప్రచార పర్వం, అభ్యర్థుల శైలి, వారి కదలికలపై చర్చిస్తున్నారు. మరుసటి రోజు చేపట్టనున్న కార్యక్రమాలు చేపట్టాల్సిన వ్యూహాలకు పదను పెడుతున్నారు. వివిధ సామాజిక వర్గాల్లోని బలమైన వ్యక్తులు, ద్వితీయ శ్రేణి నేతలను తమవైపు తిప్పుకొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల్లో కొంతమంది ద్వితీయశ్రేణి నాయకులు, అసంతృప్తులు అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. వారిని తమతో పాటు ఉండేలా బుజ్జగింపులు చేస్తున్నారు. వారితో నేరుగా మంతనాలు జరుపుతూ.. అన్నీ చూసుకుంటామని భరోసా కల్పిస్తూ.. తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.